క్లుప్తంగా

ఘనంగా లయన్స్ సర్వీస్ డే



పొన్నూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళ ఆధ్వర్యంలో బుధవారం లయన్స్ సర్వీస్ డే, ఎయిర్ ఫోర్స్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌తో పాటు విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు షేక్ సుభాని, సి.హెచ్.శివకుమారశర్మ, మస్తాన్ వలి, షేక్ షాన్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జి.శోభ, కోశాధికారి పి.నిర్మలాదేవి, పి.రంగవల్లి, ఎం. అనసూయదేవి, పి.శేషకుమారి, పి.మోహనలక్ష్మి, పి.నాగమంజరి, ఎస్.జీవహంస, ఎస్.శ్రీలక్ష్మి, ఎ.విమల, కె.విజయలక్ష్మి పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షురాలు బి. ఝాన్సీరాణి పర్యవేక్షించారు.

ఎన్‌ఆర్‌ఐ విద్యార్థుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ సమావేశం డిమాండ్

లక్ష్మీపురం: భారతీయ విద్యార్థులపై పెరుగుతున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.వెంకటరత్నం కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రవాస భారతీయ విద్యార్థి తల్లిదండ్రుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమెరికాలో దాడులు అధికమైనట్లు పేర్కొన్నారు. ఎన్‌ఆర్‌ఐ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరసవల్లి కృష్ణారావు మాట్లాడుతూ భారతీయ విద్యార్థుల దుస్థితి చోటుచేసుకున్న ఘటనలు సూచిస్తున్నాయని చెప్పారు. విద్యావేత్త ఎస్.రవిబాబు ప్రసంగించారు.

ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే కల్తీ లిక్కర్ దందా

పట్నంబజారు: ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే కల్తీ లిక్కర్ దందా కొనసాగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ బుధవారం ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర మంతా బెల్టుషాపుల దందాతో పాటు, కల్తీ మద్యం మాఫియా చేస్తున్నారని మండి పడ్డారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో స్పీకర్ తన అనుచరులకు అప్పగించి మాఫియా నడిపిస్తున్నారని ఆరోపించారు. తంబళ్లపల్లెలో మంత్రి ఆధ్వర్యంలోనే లిక్కర్ దందా నడుస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల బెల్టు షాపుల ద్వారా కల్తీ లిక్కర్ పంపిణీ చేసి వచ్చిన ఆదాయాన్ని మంత్రుల ద్వారా ముఖ్యమంత్రి ప్యాలెస్‌కు చేరుతున్నాయని విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో 43 వేల బెల్టుషాపులు తొలగించిన విషయం గుర్తు చేశారు. కూటమి నేతలు వారి జేబులు నింపుకునేందుకు అమాయకుల ప్రాణాలు తీస్తున్నారని, చట్టం ముందు దోషులుగా నిలబడేరోజులు దగ్గర్లోనే ఉన్నాయని స్పష్టం చేశారు.

వర్క్‌షాప్‌కు హాజరైన ఇన్‌ట్యాక్ సభ్యుల బృందం



గుంటూరు ఎడ్యుకేషన్: భారత జాతీయ కళ, సంస్కృతిక వారసత్వ సంస్థ(ఇన్‌ట్యాక్) ఆధ్వర్యంలో ఢిల్లీలో వివిధ రాష్ట్రాల్లోని ఇన్‌ట్యాక్ ప్రతినిధులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌లో గుంటూరుకు చెందిన సభ్యుల బృందం పాల్గొంది. ఇన్‌ట్యాక్ చైర్మన్ అశోక్‌సింగ్ ఠాకూర్ అధ్యక్షతన నిర్వహించిన వర్క్‌షాప్‌లో చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ అరవింద్ శుక్లా దేశంలోని వారసత్వ చారిత్రక ప్రాంతాలు, పరిరక్షణకు సంబంధించిన కీలక అంశాలపై ప్రసంగించారు. గురువారం వరకు జరగనున్న వర్క్‌షాప్‌లో గుంటూరు నుంచి అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, ఇన్‌ట్యాక్ సభ్యులు మేకల రవీంద్రబాబు, ఎస్. సుకీర్తి, కె.ప్రవీణ, డాక్టర్ రేణుకారాణి, ఎస్. మహిపాల్ రెడ్డి, ఈ.రమేష్, ఎం.వెంకట సుబ్బారెడ్డి, నాగభూషణం, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నట్లు మేకల రవీంద్రబాబు బుధవారం ఢిల్లీ నుంచి తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ, వైజాగ్, కడప నుంచి వెళ్లిన సభ్యులు ప్రాచీన కట్టడాలను సందర్శించి, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు.

శ్రీశైలం బోర్డు సభ్యుడు సుబ్బారావుకు సన్మానం

గుంటూరు మెడికల్: ప్రముఖ వ్యాపారవేత్త ఫినిక్స్ మాడ్యులర్ ఫర్నిచర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ బోడేపూడి వెంకటసుబ్బారావును శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం బోర్డు మెంబర్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. బుధవారం బోడేపూడి వెంకట సుబ్బారావును ధర్మపీఠం ప్రతినిధులు అభినందించారు.వెంకటసుబ్బారావు మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం తనకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. కార్యక్రమంలో ధర్మపీఠం సంక్షేమ సేవా సంఘం ఫౌండర్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఆల్ ఇండియా సలహా మండలి సభ్యుడు డాక్టర్ గంటా సతీష్ కుమార్, హైకోర్టు న్యాయవాది డాక్టర్ రామకోటిరెడ్డి, జిల్లా కోర్టు న్యాయవాది, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ఫ్యాకల్టీ పరుచూరి కుమారి పాల్గొన్నారు.

ఆహ్లాదం ఆవిరి!

అభివృద్ధికి నోచుకోని పార్కులు



పార్కు ప్రదేశంలో మద్యం సీసాలు పడేస్తున్న దృశ్యం

పొన్నూరు: రోజులు మారాయి. ప్రస్తుతం పని ఒత్తిడి పెరిగింది. అందుకు చిన్న పెద్ద తేడా లేకుండా పోయింది. గతంలో ఇళ్ల వద్దే నలుగురు చేరి సరదా కబుర్లు చెప్పుకునేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. దీంతో పల్లె నుంచి పట్టణవాసుల వరకు ఆహ్లాదాన్ని కోరుకుంటున్నారు. అందుకు అనువైన ప్రాంతం పార్కులే. కానీ వాటిపై పాలకుల నిర్లక్ష్యంతో ఆహ్లాదం ఆవిరవుతోంది.

వివరాలు.. పట్టణంలో జనాభా సుమారు 70 వేల వరకు ఉన్నారు. నాలుగు పార్కులున్నాయి. రెండు పార్కులు వైఎస్సార్ సీపీ హయాంలో ఆధునీకీకరణ చేపట్టారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఉద్యాన వనాల అభివృద్ధి ఊసేలేకుండా పోయింది. చిన్నారుల ఆటపాటలకు, పెద్దలు సేదతీరేందుకు పొన్నూరు పురపాలకలో అనువైన వాతావరణం కరువైంది. ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి కావడంతో నడకకోసం పట్టణవాసులు ప్రధాన రహదారులపైకి రావాల్సి వస్తోంది. అంబేడ్కర్ కాలనీలోని పార్కు శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ప్రాంగణమంతా పిచ్చి చెట్లు పెరిగి చెత్త వ్యర్థాలతో నిండింది. మురుగు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేపడతామని చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపాలిటీకి పన్నుల రూపేణా ఆదాయం మెండుగా ఉన్నా పార్కుల అభివృద్ధిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అంబేడ్కర్ కాలనీలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద పార్కు సమకూరుతుందనే ఆశాభావాన్ని పురవాసులు వ్యక్తం చేస్తున్నారు.



పిచ్చి చెట్లతో అధ్వానంగా ఉన్న అంబేడ్కర్ కాలనీలోని పార్కు



పార్కులో విరిగిన బల్లలు

మా పల్లెకు.. వెలుగు రాదా..

ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజల ఇక్కట్లు



పొన్నూరు డిపోలో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పొన్నూరు: పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో పల్లె ప్రజలు అవస్థలు పడుతున్నారు. పొన్నూరు ఆర్టీసీ డిపో పరిధిలోని సర్వీసులు ప్రధాన రహదారులకే పరిమితమయ్యాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. మండలంలోని 29 గ్రామాలలో సుమారు 20 గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు వెళ్లడం లేదు. ప్రయాణానికి ఉచిత బస్సులు ఉన్నా కూడా అవి గ్రామాల్లో అందుబాటులో లేని కారణంగా ప్రైవేటు వాహనాలు ఎక్కడం తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మహిళలు కోరుతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

పొన్నూరు ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందించాలన్న లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన ఆర్టీసీ డిపోను సుమారు రూ.35 లక్షలతో ఆధునికీకరించారు. ప్రభుత్వం మారడంతో ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం అందడంలేదు. సర్వీసులు పెంచకపోవడం, గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో గ్రామీణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. పొన్నూరు డిపో పరిధిలో 46 సర్వీసులు వివిధ ప్రాంతాలకు తిరుగుతున్నాయని అధికారులు తెలిపారు. వాటిలో 5 ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ లగ్జరీలు 5, అద్దె బస్సులు 7 ఉండగా, 29 పల్లె వెలుగు బస్సులు నడుస్తున్నాయి. అయితే ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పల్లె వెలుగు బస్సులు ప్రధాన రహదారులైన చీరాల–గుంటూరు, పొన్నూరు – గుంటూరుకు మాత్రమే పరిమితమయ్యాయి. కాకుమాను, వట్టిచెరుకూరు, నిజాంపట్నం, తెనాలికి కొనసాగుతున్నాయి. మేజర్ పంచాయతీలకు కూడా బస్సు సర్వీసులు ఏర్పాటు చేయక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. డయల్ యువర్ డిపో మేనేజరు కార్యక్రమంలో ప్రజల నుంచి అనేక వినతులు వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ శ్రీకాంత్

గుంటూరు రూరల్: సైబర్ నేరాల రక్షణకు వ్యక్తిగత సమాచార గోప్యత అవసరమని యూనియన్ బ్యాంక్ గుంటూరు రీజియన్ చీఫ్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్‌లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సైబర్ క్రైంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరి జీవితంలో సాంకేతికత అనివార్యమైందని, దానితోపాటు సైబర్ మోసాలు కూడా వేగంగా పెరుగుతున్నాయని వివరించారు. వ్యక్తిగత సమాచార గోప్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సైబర్ నేరస్తులు ఆకర్షణీయమైన ఆన్లైన్ లింకులు ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. సోషల్ మీడియా వేదికలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా పరిచయమయ్యే అపరిచితులతో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలలో అప్రమత్తత అవసరమని, బ్యాంకింగ్ సంబంధిత సమాచారం ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. ఫిషింగ్, సైబర్ నేరాల నియంత్రణ దిశగా విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాలను ఆవిష్కరించి, సమాజానికి సురక్షితమైన డిజిటల్ వాతావరణం సృష్టించడంలో యువత కీలక పాత్ర పోషించాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని సూచించారు. డిజిటల్ బ్యాంకింగ్ మోసాలను నివారించేందుకు అవగాహన కల్పించడంలో బ్యాంకింగ్ రంగం ముందడుగు వేయడం అభినందనీయమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏటి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, యూనియన్ బ్యాంకు డిజిటల్ బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ కిరణ్ విక్టర్, చౌడవరం బ్రాంచ్ మేనేజర్ మునివర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అంకిరెడ్డిపాలెం విద్యార్థులు



రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్:మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్–19 బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీల్లో సత్తా చాటారు. చిలకలూరిపేట ఏఎంజీ జూనియర్ కళాశాలలో నిర్వహించగా రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారని కళాశాల ప్రధానోపాధ్యాయురాలు చావలి సరోజిని బుధవారం తెలిపారు. ఇంటర్ విద్యార్థినులు దొడ్డా నేత్ర, చల్లా ఆకాశ్ జిల్లా జట్టులో స్థానం సంపాదించి వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నీల్లో పాల్గొనే అవకాశం లభించిందన్నారు. అంకిరెడ్డిపాలెంలోని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన సింథటిక్ టర్ఫ్ బాస్కెట్ బాల్ కోర్టులో కోచ్‌ల పర్యవేక్షణలో నిత్యం శిక్షణ తీసుకొని మెరుగైన ప్రతిభ కనబరిచినందుకు విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి, క్రీడాకారులకు నగదు పారితోషికం అందజేసి అభినందించారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఇన్‌చార్జి రామచంద్రరావు, శ్రీనివాసరావు, శివపార్వతి, షకీలా, ఫిజికల్ డైరెక్టర్ నాగిరెడ్డి, హనుమంతరావు, విద్యార్థులు క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ కుర్రా సాంబిరెడ్డి, కుర్రా పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఎన్‌సీసీ దోహదం



క్యాడెట్స్ ఎంపిక చేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

గుంటూరు రూరల్: పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఎన్‌సీసీ దోహదం చేస్తుందని ఎన్‌సీసీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎ.ఉదయ్‌కుమార్ తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో 22(ఏ) ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్నల్ మాట్లాడుతూ ఈ యూనిట్ ద్వారా ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ప్రాథమిక సైనిక శిక్షణ అందిస్తూ, సమాజంపై వారికి ఉన్న బాధ్యతని తెలియజేయటం జరుగుతుందని పేర్కొన్నారు. క్రమశిక్షణతోపాటు శారీరక దారుఢ్యం ఆరోగ్య పరిరక్షణ వంటి లక్షణాలు అలవడతాయని చెప్పారు. చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్మీలో సిబ్బంది కొరత తీర్చేందుకు 1948లో ఎన్‌సీసీ ఏర్పడిందని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి ఇండియన్ డిఫెన్స్ యాక్ట్ 1917లో దీనిని రూపొందించటం జరిగిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్‌సీసీలో శిక్షణ పొందిన విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాల సామాజిక, సాంస్కృతిక, అంశాలను తెలుసుకోగలుగుతారని వివరించారు. అనంతరం విద్యార్థుల ఎత్తు, బరువు, తదితర కొలతలను తీసుకుని క్యాడెట్స్ ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, ఎన్‌సీసీ సిబ్బంది సుబేదార్ సరేంద్రసింగ్, సుబేదార్ సునీల్‌కుమార్, హవల్దార్ చరణ్‌సింగ్, హవల్దార్ కేవీ సుబ్బారావు, ఏఎస్ రెడ్డి, నవ్య, సీహెచ్ శ్రీరామతులసి పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

లక్ష్మీపురం: గుంటూరు ఏటీ అగ్రహారంలోని ఇస్కాన్ టెంపుల వద్ద ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి తిరిగి వచ్చి చూసే సరికి వాహనం కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. సంగడిగుంట ప్రాంతానికి చెందిన శాఖమూరి గోవింద్, రెండు నెలల క్రితం గోవింద్ ఏటి అగ్రహారంలోని ఇస్కాన్ టెంపుల్ వద్ద వంట పనికి ద్విచక్రవాహనంపై వెళ్లి పార్కింగ్ చేసి పని ముగించుకుని వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. చుట్టు పక్కల గుంటూరు బస్టాండ్, రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రదేశాలలో ఎంత వెతుకలాడిన వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు దిక్కుతోచక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తూ నిరసన



పెదకాకానిలో నిరసన తెలియజేస్తున్న నాయకులు

పెదకాకాని: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి హేయమని సర్పంచి గోళ్ల స్వరూపరాణి అన్నారు. సీజేపై దాడికి ఖండిస్తూ పెదకాకాని సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం రాత్రి నిరసన తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోళ్ల శ్యాం ముఖర్జీబాబు మాట్లాడారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ చిత్రపటాలను, ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు షేక్ షహనాజ్, మండల క్రిస్టియన్ ఫోరం అధ్యక్షుడు లింగంగుంట సాల్మన్‌రాజు, సీపీఐ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడికి యత్నించిన నిందితుడిని శిక్షించాలి

ఏఎన్‌యూ(పెదకాకాని): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని ఎన్‌డీఎస్‌ఎఫ్(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ దళిత విద్యార్థి సమాఖ్య) అధ్యక్షుడు దుర్గారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సుప్రీం కోర్టు కేవలం మనుషులకు న్యాయం చేయడానికే కానీ దేవుళ్లకు దేవతా విగ్రహాలవంటి మానవాతీత శక్తులకు న్యాయం చేయడానికి కాదని, సుప్రీం కోర్టు పరిధిలోకి రాని అటువంటి అంశాలపైన న్యాయం చేయలేదని దాడులకు ప్రయత్నించాడాన్ని ఖండించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో ఎన్‌డీఎస్‌ఎఫ్ ప్రెసిడెంట్ దుర్గారావు, వైస్ ప్రెసిడెంట్ రఘు, సెక్రటరీ ప్రశాంత్, కావ్య ఉన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి లక్ష్యంగా తమ కళాశాలలో నైపుణ్యాలతో కూడిన విద్యనందించనున్నట్లు చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం కళాశాలలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ 2025 నిర్వహించారు. కార్యక్రమంలో దివీస్ లాబొరేటరీస్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.రామకృష్ణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పరిశ్రమలో ఉన్న అవకాశాలు, విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఇంటర్వ్యూలో రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత ఇంటర్వ్యూ దశల్లో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యాలను అంచనా వేశారు. ఎంపికైన 9 మంది విద్యార్థులకు హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ యూనిట్లలో ఉద్యోగావకాశాలు లభించాయి. వార్షిక వేతనం రూ.2,40,000 నుంచి రూ.3,40,000 వరకు నిర్ణయించి విద్యార్థులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉద్యోగాలను సాధించిన విద్యార్థులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

గంజాయి కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మధుసూదన్‌రావు

నగరంపాలెం: గంజాయి, మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సీసీఎస్ డీఎస్పీ బీవీ మధుసూదన్‌రావు కోరారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో బుధవారం ఈగల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భాగంగా జిల్లా శిక్షణ కేంద్రం, ఈగల్ విభాగం సంయుక్తంగా పోలీస్‌స్టేషన్ల రైటర్లు, ఈగల్ విభాగ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి, ఇతరత్రా మాదకద్రవ్యాల కేసుల్లో చట్టపరమైన నిబంధనలను పాటించాలని కోరారు. నిందితులకు శిక్షలు పడేలా కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. సీజ్ చేసిన మాదకద్రవ్యాల నిర్వహణ సక్రమంగా ఉండాలని అన్నారు. గంజాయి కేసుల్లో నిందితులకు శిక్షలు విధించేందుకు దర్యాప్తు అధికారులు స్పష్టమైన సాక్ష్యాధారాలు సమర్పించే దిశగా దృష్టి సారించాలని కోరారు. మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం ప్రకారం గంజాయి, మాదకద్రవ్యాల సీజ్, స్టోరేజ్, శాంపిలింగ్, డిస్పోజల్ వంటి దశల్లో పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. సీజ్, శాంప్లింగ్, సీజ్ చేసిన పదార్థాల లిస్ట్ నమోదు ప్రక్రియను సాక్షుల సమక్షంలో నిర్వహించాలన్నారు. సదస్సులో సీఐలు రాజశేఖర్‌రెడ్డి (డీటీసీ), రవికుమార్ (ఈగల్), ఆర్ఎస్ఐ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి లక్ష్యంగా తమ కళాశాలలో నైపుణ్యాలతో కూడిన విద్యనందించనున్నట్లు చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం కళాశాలలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ 2025 నిర్వహించారు. కార్యక్రమంలో దివీస్ లాబొరేటరీస్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.రామకృష్ణ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పరిశ్రమలో ఉన్న అవకాశాలు, విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఇంటర్వ్యూలో రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత ఇంటర్వ్యూ దశల్లో విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యాలను అంచనా వేశారు. ఎంపికైన 9 మంది విద్యార్థులకు హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ యూనిట్లలో ఉద్యోగావకాశాలు లభించాయి. వార్షిక వేతనం రూ.2,40,000 నుంచి రూ.3,40,000 వరకు నిర్ణయించి విద్యార్థులతో ఒప్పందం కుదుర్చు

ఉద్యోగం పేరుతో మోసం

- రూ.4 లక్షలు వసూలు చేసిన కార్పొరేషన్ ఉద్యోగి
- కమిషనర్ ఫోర్జరీ సంతకంతో నకిలీ ఆర్డర్ ఇచ్చిన వైనం
- నకిలీ ఆర్డర్ అని తెలుసుకుని ఖంగుతిన్న బాధితుడు
- తీరా మోసపోయానని కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన వైనం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానని కార్పొరేషన్ ఉద్యోగి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడంటూ నగరానికి చెందిన ఓ వ్యక్తి కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సర్కిల్ ఆఫీస్‌లో పనిచేసే ఉద్యోగి ఉద్యోగం ఉందంటూ ఒక వ్యక్తికి నమ్మబలికి అతడి వద్ద నుంచి డబ్బులు తీసుకుని అతడికి కమిషనర్ ఫోర్జరీ సంతకంతో కూడిన ఆర్డర్‌ను సిద్ధ చేసి అతనికి ఇచ్చాడు. సదరు ఆర్డర్ తీసుకుని కార్పొరేషన్‌లో నా సీటు చూపించండి ఉద్యోగం చేసుకుంటానని కార్పొరేషన్ చుట్టూ తిరగుతున్న బాధితున్నప్పటికి ఎవరూ సీటు చూపించకపోవడంతో సదరు ఉద్యోగి ఇచ్చిన ఆర్డర్ కాపీ దొంగ ఆర్డర్ అని గ్రహించి కమిషనర్ వద్దకు వచ్చి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. సదరు ఫిర్యాదుతో కమిషనర్ అతడిపై విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. దీనిపై కార్యాలయ అధికారులను సంప్రదించగా కప్పిబుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి

లక్ష్మీపురం: సీఐటీయూ అఖిల భారత మహాసభలు డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ తెలిపారు. పాత గుంటూరులోని జిల్లా కార్యాలయంలో సంఘ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి బి.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు మహాసభలలో కార్యచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పని గంటలు తగ్గించాలని, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, యానిమేటర్లు ఇతర స్కీం వర్కర్ల అందరికీ కనీస వేతనం పెరుగుతున్న ధరలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన ఏ వాగ్దానం కూటమి ప్రభుత్వం అమలు చేయలేదంటే ఈ ప్రభుత్వానికి కార్మిక వర్గంపై ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణంలో స్థానికులకు అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం కార్యదర్శి వై.నేతాజీ, వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ జీ రమణ, ఉపాధ్యక్షులు హుస్సేన్ వలి, దుర్గారావు, బి.ముత్యాలరావు, ఎస్.శివాజీ, ఎన్.రమేష్ బాబు, నాయకులు గాంధీ రామ్మోహనరావు, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మంగళగిరి ఆర్టీసీ డ్రైవర్ వేతనాల్లో వివక్ష

మంగళగిరి టౌన్: రాజధాని ప్రాంతమైన మంగళగిరి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్యూటీ డ్రైవర్స్ వేతనాలు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంగళగిరి డిపోలో వివక్ష నడుస్తోందని గుంటూరు జిల్లా పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపినాథ్, జిల్లా కమిటీ సభ్యులు నాగుర్ వలి, మంజుశ్రీ, శ్రీదర్‌లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆన్‌కాల్ డ్రైవర్లకు సింగిల్ డ్యూటీకి వెయ్యి రూపాయలు, డబుల్ డ్యూటీకి 2 వేల రూపాయలు ఇస్తుంటే మంగళగిరిలో మాత్రం డబుల్ డ్యూటీకి 1600 రూపాయలు మాత్రమే ఇస్తూ డ్రైవర్లను ఇబ్బంది పెట్టి బాధపెడుతున్నారన్నారు. మంగళగిరి డిపోలో సుమారుగా 20 మందికి పైగా ఆన్‌కాల్ డ్రైవర్లు ఉన్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అన్నిచోట్లా ఎలా ఇస్తున్నారో అలాగే మంగళగిరి డిపోలో కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సు పథకం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం బస్సుల సంఖ్య పెంచలేదని, కొత్త బస్సులు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఒక బస్సులో 100 మంది నుంచి 120 మంది దాకా ప్రయాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా ప్రజల పట్ల భద్రత వహించాలని, బస్సుల సంఖ్య పెంచాలని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.